రెప్పపాటులో ఏం జరిగిందో తెలియదు గాని, ఒక్క కుదుపులో సీట్లో నుండి ఎగిరి క్రిందపడింది హేమంత. ఆ పడ్డపాటుకి కుడికాలు మడతపడటమే కాకుండా, తల దిమ్మెర పోయేటట్లు బలంగా, ఎదట సీటుకి నుదురు కొట్టుకోవడంతో కళ్ళు తిరిగి తనకేమైందో తెలియని మైకం కమ్మేసింది, కొన్ని నిముషాలపాటు.

తెలివొచ్చేసరికి శరీరంలో భరించలేని బాధ! కాలు కూడ తీసుకోలేని పరిస్థితి! నుదుటి నరాలు లాగిపెట్టిన నొప్పి గాక అంతకు మించిన భయం, ఆందోళన ఆమెను కలవరపరిచేయి.

ట్రెయిన్ ఏదో ప్రమాదానికి లోనైందని తెలుస్తోంది. జనం చాలామట్టుకు క్రిందికి దిగిపోయేరు. ఆ చిమ్మ చీకటిలో ఎక్కడున్నారో ఏం జరిగిందో తెలియని అయోమయ భయావస్థ తాలూకు ఆక్రందనలు, అరుపులు, ఆర్తనాదాలు గాలికి కలగలసిపోవడంతో అక్కడొక భయానక పరిస్థితి ఏర్పడింది.

హేమంత గుండెలవిసిపోయేయి. పెట్టెలో చాలామంది దిగిపోయినట్లున్నారు. బయట గోల తప్ప ఎవరూ వున్నట్లు లేదు. లేచి తనూ దిగాలంటే కాళ్ళు తీసుకోను వీలు కాకున్నది.

ప్రమాదంలో తనకు ప్రాణం పోలేదు. కాని ప్రాణాంతకమైన పరిస్థితిలో చిక్కుపడ్డానని తెలుసుకున్నాక దుఃఖం పెల్లుబికింది.

మనసుకూ, శరీరానికి తగిలిన గాయాల బాధకు "అమ్మా!" అనే ఆక్రందన అతి నెమ్మదిగా ఆమె గొంతు నుండి వెలువడింది.

ఆ పిలుపులో తల్లి తలపుకొచ్చింది.

గాయాన్ని కెలికినట్లు విలవిలలాడి పోయింది ఆమె హృదయం. 'మదర్ సీరియస్. స్టార్ట్ ఇమీడియట్లీ' అనే టెలిగ్రాం చూసుకొని స్పృహ తప్పిపోయే పరిస్థితిని అదుపులోకి తెచ్చుకొంటూ రెండు చీరలు బ్యాగ్‌లో కుక్కుకొని, లలిత ధైర్యం చెప్పగా యెకాయెకిన బండెక్కింది.

ఎప్పుడెప్పుడు తల్లి దగ్గర వాలతానా అనే ఆదుర్దాలో బండి కంటె వేగంగా మనసు పరుగు తీస్తూ, ఆలోచనలు చేస్తోన్న సమయంలో ఈ ప్రమాదం? దరిదాపుగా చేరువ కానున్న సమయంలో ఈ ఘోరం.

'అమ్మకెలా వుందో? అసలక్కడకు తను చేరగలదో లేదో' అన్న భయం ఆమెను మరింత ఆ వేదనకు గురిచేస్తోందిప్పుడు.

ప్రయత్నం మీద సీటు పట్టుకొని లేవబోయింది గాని కాలు కలుక్కుమనడంతో కుప్పలా కూలబడింది మళ్ళీ.

తన నిస్సహాయ స్థితికి ఏడుపు ముంచుకొచ్చింది.

"అమ్మా! అమ్మా!" అంటూ ఆక్రోశిస్తూనే వెక్కి వెక్కి ఏడుస్తుండి పోయింది హేమంత.

ఎవరో అగ్గిపుల్ల గీసేరు. పల్చని వెలుగు



రెపరెపలాడింది లోపలకు దూసుకొస్తున్న గాలికి.

ప్రాణం లేచొచ్చినంత ఆశతో తలెత్తి చూసింది హేమంత.

"ఏమైనా దెబ్బలు తగిలేయా మేడమ్?" ఎవరిదో కరకు గొంతు.

నోరు పెగలక తల ఊపుతూ ఏడుపు నాపుకొంది. అతడు ఒక అడుగు ముందుకు వేసేడు.

అగ్గిపుల్ల ఆరిపోయింది. పక్కకు తొలగిన చీకటి పరుగున చేరి ఆక్రమించుకొంది.

బయట అరుపులు, కేకలు కలగాపులగంగా వినిపిస్తున్నాయి.

భయంతో చూస్తుండగానే, మళ్ళీ అగ్గిపెట్టెను రాచుకొని మరోపుల్ల వెలిగిందతడి చేతిలో. కాని అతడి రూపు స్పష్టంగా కనిపించడం లేదు. "అందరూ దిగిపోయేరు - మీరూ దిగగలిగితే ఏదైనా దారి చూసుకోవచ్చును. ప్రమాదం జరిగిన ఈ స్థలానికి తెనాలి రెండు మూడు మైళ్ళు మించి ఉండదంటున్నారు." అన్నాడు.

"కాలు....కాలు మడత పడింది" నెమ్మదిగా బాధతో అంది.

అతి ప్రయత్నం మీద అతడి సహాయంతో లేచి నిలబడ గలిగింది. తర్వాత ట్రెయిన్ దిగేందుకూ అతడు సహాయపడ్డాడు. ఆమె బ్యాగ్ అతడే పట్టుకొన్నాడు.

ఊరూ, అడవి కాని ప్రదేశం అది.

దిక్కుతోచని జనం తల్లడింతలు పడుతున్నారు.

రాత్రి కురిసిన వానకు పట్టాలు తొలగి వున్నాయి. అదృష్టవశాత్తు కొద్ది ప్రమాదమే జరిగింది. గాయాలే గాని ప్రాణ నష్టం లేదనుకొంటున్నారంతా.

అప్పుడు చూసిందతడిని పరీక్షగా.

తన సీటు ఎదురుగా వున్న సీటే అతనిది. ప్రమాదం జరిగే ముందు అతడు లేచి టాయ్‌లెట్‌కు వెళ్ళడం తెలుసు.

గుబురుగా పెరిగిన గడ్డం మీసాలతో కలగలిసిపోగా, తీక్షణమైన చూపులొక్కటే అతడి ముఖంలో ప్రస్ఫుటంగా కనిపించాయి. నల్లని పాంటు, గచ్చకాయ రంగు చొక్కాతో, కాకి సంచీ ఒకటి భుజాన వ్రేలాడుతోండగా తెల్ల కళ్ళద్దాల చాటునుంచి పదునుగా తనని పరికించే ఆ చూపుకి కలవరపడటమే కాదు, ఇబ్బందిగా కూడా ఫీలయింది.

ఎంత చిత్రంగా అతడే తిరిగొచ్చి మరీ తనని పట్టి దింపించాడు అనుకొంది.

నడి సముద్రంలో తుఫానుకు గురి అయిన మనిషికి ఏ చిన్న ఆధారమూ గొప్ప ఆలంబనే అనిపించకపోదు.

తన నొదిలిపెట్టి కొద్దిగా పైకెళ్ళి ఎవరితోనో మాట్లాడి తిరిగివచ్చేడు అతడు.

"తెల్లవారే వరకూ ఇక్కడ జాగారణ తప్పదంటున్నారు. అందాకా ట్రెయిన్‌లో తలదాచుకోవడమే మెరుగేమో. మళ్ళీ మీరు కాలు నొప్పితో సర్కస్ ఫీట్ చేయక తప్పదు." నవ్వబోయేడు అతడు.

"మీరు?" అప్రయత్నంగా అంది. అడిగేక ఎందుకడిగేనా అనిపించకపోలేదు ఆమెకి.

"విజయవాడ వెళ్ళి అక్కడనుండి ఏలూరు వెళ్ళాలి. కొంతమంది ఇక్కడ నుండి తెనాలి వరకూ నడిచిపోదామనే ప్రయత్నంలో వున్నారు. నేనూ వెళ్ళి, తెనాల్లో విజయవాడ బస్సు కాచ్ చేయగలనేమో చూడాలి."

హేమంత ఆలోచనతో వుండిపోయింది కొంతసేపు.

తెల్లవారే దాకా ఇక్కడనుండి కదిలే దిక్కు లేదు. ఆ తర్వాత అయినా రైల్వే సిబ్బంది ఇంత మందిని తెనాలి స్టేషనుకు చేర్చటం అంటే అంత త్వరగా అయే పనికాదు.

ఇంజను, మొదటి బోగీ కొంత పాడయినాయనుకొంటున్నారు.

ఎలాగో కష్టపడి తెనాలి చేరగలిగితే అక్కడ నుండి ఎంతదూరమని తన వూరు? ఏ రిక్షా అయినా గుర్రం బండీ అయినా మాట్లాడుకొని వెళ్ళిపోగలదు. కాలు నొప్పి కొంత తగ్గినట్లే అనిపిస్తోంది.

ఇక్కడ వుండి అమ్మను తలచుకొని బాధపడేకంటే, కొంత బాధే అయినా కాలు కూడదీసుకొని నడవగలగడమే మేలు అనుకొంది. బ్యాగ్ తప్ప వేరే సామానూ లేదు. ఇంకా కొంత మంది తోడూ వున్నారు.

"నేనూ వస్తాను. తెనాలి వెళ్ళిపోతే అక్కడ నుండి ఓ అర్ధగంటలో ఏ రిక్షాలోనైనా మావూరు చేరిపోగలను. మా అమ్మకు సీరియస్‌గా వుందనే టెలిగ్రాం చూసుకొని బయలుదేరుతున్నాను. ప్లీజ్, నాకొంచెం హెల్ప్ చేయగలిగితే, మీ అందరితో పాటు నేనూ బయలుదేరతాను. నాకు, మా చెల్లెకి ఉన్నది మా అమ్మ ఒక్కతే!" గొంతులో వేదన.

"ఓ!" అతడు ఆలోచనగా అన్నాడు. "మీకాలు నొప్పి?"

"ఇంతకుముందున్నంత లేదు. కొంచెం దూరం నడిస్తే అలవాటయిపోగలదు కూడా."

"మీ ఇష్టం. పదండి. ఆ బ్యాగు నేను తీసుకొంటాను."

పెట్టె బేడా లేని ఉత్త మనుష్యులు, ఎక్కువగా మగవాళ్ళే పదీ, పదిహేను మంది గుంపుగా తుప్పలు, రాళ్ళు దాటుకొని రోడ్డున పడ్డారు.

గుబురుగా విస్తరించుకొనిపోయిన చెట్ల క్రీనీడల్లో నడక ప్రారంభించేరు అంతా. వెనక తామిద్దరూ.

దశమి వెన్నెల పల్చగా పడుతోంది. రాత్రి కురిసిన వానకుగాను గాలి చల్లగా వీస్తోంది. హేమంతకు బ్రతికి బయటపడినట్లనిపిస్తోందిప్పుడు. ఇంకెంతసేపు రెండు మూడు గంటల్లో తల్లి దగ్గర వుంటుంది. ఎలా వున్నదో అమ్మకు? చెల్లి ఎంత తల్లడిల్లిపోతుందో? అనుకొంది.

తృటి కాలంలో సంభవించిన ప్రమాదం గురించి, జరిగిన అనుభవం గురించి, పొందిన భయం గురించి ఒకళ్ళకొకళ్ళు చెప్పుకొంటున్నారు.

అతడూ చెబుతూ మధ్యలో అడిగేడు "మీ పేరేమిటో తెలుసుకోవచ్చునా?"

"హేమంత!" అంటూనే వివరాలు చెప్పింది తను.

అడగకుండానే అతడు చెప్పేడు. పేరు భగవాన్ దాస్!

నవ్వొచ్చింది. లేచి కూర్చోలేకపోయిన తనని భగవంతుడిలా ప్రత్యక్షమయి సాయం పట్టి దింపించడమే గాక, ఇప్పుడు ఈ ఒంటరి ప్రయాణంలో తోడుగా నిలబడటం చూస్తే నిజంగా భగవంతుడే అనిపిస్తున్నాడు.

"మీది ఏలూరా?"

"ఒక ఊరంటూ ఏదీ లేదు దేశద్రిమ్మరిని" అంటూ నవ్వేడు.

ఆశ్చర్యపోయింది. 'అదేమిటి?' అంటూనే.

"అమ్మ చిన్నప్పుడే పోయింది. నాన్న మళ్ళీ పెళ్ళి చేసుకొని మైకంలో పడిపోయేక ఇంట్లో వుండలేక వీధులపాలయ్యేను నేను."

కొంచెం భయంతో చూసిందతడి వైపు.

అతడిటు చూడకుండానే అడుగులు వేస్తున్నాడు.

ముందుకు చూసింది. దూరాన బయలుదేరిన గుంపు.

నడక వేగం హెచ్చించింది హేమంత.

"మీ రెంతో అదృష్టవంతులు అమ్మ అయినా వుంది." అతడన్నాడు.

మాట్లాడలేదు హేమంత. మౌనంగా విన్నది.

తను అదృష్టవంతురాలే అతడన్నట్లు. నాన్న లేని లోటు తెలియకుండా పెంచింది అమ్మ తనని, చెల్లిని.

ఆ వూళ్ళో స్కూలు చదువు అయ్యేక, కాలేజిలో చేరతానంటే అత్తయ్య వాళ్ళు ఇష్టపడక పోయినా, తనను నొప్పించడం ఇష్టంలేక తెనాలి కాలేజిలో చేర్పించింది.

డిగ్రీ తీసుకున్నాక పోస్టు గ్రాడ్యుయేషన్ చేస్తానని అన్నప్పుడు అత్తయ్య, బావ, చివరకు అమ్మ ఒప్పుకోలేదు.

బావను బ్రతిమలాడుకుని అమ్మను ఒప్పించింది.

'దూరా భారం 'ఎందుకొచ్చిన చదువులు' అని విసుక్కొంటే గడ్డం పట్టుకొని బుజ్జగించింది. తల్లిని, 'శెలవులొచ్చినప్పుడల్లా పరిగెత్తుకొని రానూ మా అమ్మ దగ్గరకు !' అంటూ

వెళ్ళి ఆర్నెల్లు కాలేదు. ఆరోగ్యంగా వుండే అమ్మకు ఇంతలో ఏమైందని ప్రమాదంగా వుండటం?

గుండెల్లో ఆవేదన. 'అమ్మా....అమ్మా' అనే ఆక్రందన నిశ్శబ్దంగా.

చెల్లి ఎంత తల్లడిల్లి పోతుందో ?

దూరంగా ఎక్కడో తీతువుపిట్ట కూత !

ఉలిక్కి పడింది హేమాంత. 'అమ్మకెలా వుందో ?' గుండెలు దడదడ లాడుతోండగా అనుకొంది మళ్ళీ. ఆకాశంలోకి చూస్తూ కనిపించని దేవుళ్ళని పేరు పేరునా తలచుకొంది. మూగగా వేడుకొంది.

మెలికలు తిరుగుతున్న రోడ్డు కొనవరకూ దృష్టి సారిస్తూనే తృళ్ళి పడింది. తమతో బయల్దేరి, తమకంటే ముందుకు సాగిపోయిన వాళ్ళు కనుచూపుమేర దూరంలో కూడా లేరు. దయ్యాల్లా మాయమైపోయేరు.

రోడ్డు మీద అతడూ, తనే!

గుండె వేగంగా కొట్టుకొంది హేమంతకు. ఆలోచనలతో ఎంత తెలివితక్కువగా వెనబడింది. కావాలనే అతడే నెమ్మదిగా నడిచేడా ?

చల్లని చిరుగాలి శరీరాన్ని వణికించగా కొంగు తీసి భుజం నిండుగా కప్పుకొంది. మబ్బు కమ్ముకోవడంతో కొద్దిపాటి వెలుగు కరిగిపోయి చుట్టూ చీకట్లు చిక్కబడ్డాయి.

"కాలు నొప్పి ఎలావుంది. కొంచెం సేపు కూర్చుందామా ఆ చెట్టు మొదల్లో"

"వద్దు వద్దు" కంగారు అణుచుకొని అంది. "వానొచ్చేలా వుంది కూడా."

"రానివ్వండి. వానొచ్చినా, వరదొచ్చినా తప్పేదేముంది? ఎలాగో ప్రాణాలు దక్కించుకొని బయటపడ్డాం. అదే పదివేలనుకోండి."

"ఇప్పుడెంత దూరం వచ్చి వుంటాం ?"

"సగం దాకానేమో"

"అంతేనా ?"

అతడు నవ్వేడు. "ఇంకా నయమే. మీరాకాలుతో కుంటు కుంటూ నడుస్తారనుకున్నాను. కావి గాలిలో తేలిపోతున్నారు."

నవ్వు రాలేదు హేమంతకు.

రోడ్డు కిరువైపులా గాఢంగా అల్లుకుపోయిన ముళ్ళపొదలు, పిచ్చి తీగలు, దయ్యాల్లా నిలబడిన తాటిచెట్లు ఆమెను భయపెడుతున్నాయి.

"వాళ్ళేమయ్యారో?" ముందుకు చూస్తూ అంది.

"దయ్యాల్లా మాయమయ్యారు. పోనివ్వండి పాపం."

వింతగా చూసిందతడివైపు. లోపలేదో భయం.

ఎంత తెలివితక్కువ పని చేసిందో అప్పుడర్థమైంది హేమంతకు. అక్కడే పదిమంది మధ్య వుండిపోవడం ఎంతబాగు. ఒంటరి ప్రయాణం సాహసమే అయినా, చదువుకొన్న దాననే ధైర్యంతో తెగువతో బయలుదేరింది. ఇప్పుడేమిటి దిక్కు ?

అతదేక్షణాన ఏ విధంగా మారితే తనగతి ఏమిటి ?

కూతవేటు దూరంలో నరసంచారం లేదు. అదనుకోసం పొంచి వున్న మృగంలా నెమ్మదిగా వుండి, అదాటున మీదికి దూకితే ?

వణికిపోయింది ఆ ఆలోచనకే !

రోజూ ఎన్నెన్ని ఘోరాలు వినడం లేదు. పట్టపగలైనా, పదిమంది మధ్యనైనా స్త్రీకి రక్షణ లేని రాక్షస చర్యలను గురించి ? పేపర్లో ఎన్నెన్ని ఉదంతాలు చదవలేదు. మానభంగాల గురించి ? తెలిసీ ఈ సాహసం ఏమిటి ?

ఏడుపొస్తుంది. ఆలోచిస్తోంటే.

గుబురు గడ్డం, చీకట్లో నల్లగా కనిపించే ఆ దుస్తులు, మధ్య మధ్య తిరిగి చూసే ఆ క్రూర చూపులూ, విపరీతమైన వేగంతో కొట్టుకొంటోన్న గుండె చప్పుడు తనకు వినిపిస్తోంది స్పష్టంగా.

మంచి వాడనిపించిన అతడి నిజస్వరూపం ఇప్పుడు సుస్పష్టంగా అవగాహనవుతున్నట్లనిపిస్తోంది. ఏదైనా అఘాయిత్యం జరిగితే? ఆలోచనలతో తల్లడిల్లిపోతున్న ఆమె కెవ్వుమంది, అతడు చెయ్యి గట్టిగా పట్టుకుని ఒక్క విసురున దగ్గరకు లాక్కోవడంతో.

"వొదులు, వొదులు" విదిలించుకోబోయింది. కాని అతడు చెయ్యి వదల్లేదు.

మెరుపులా ఎదురు తిరగబోతున్నంతలో అతడన్నాడు నెమ్మదిగా.

"అటు చూడండి."

రోడ్డు మీదికి చూసింది.

వెలుగు నీడలు దోబూచులాడే రోడ్డు మీద జరజరా పాకిపోతున్న ఐదారడుగుల త్రాచుపామును చూస్తూ భయవిహ్వలురాలై నోరుతెరచుకొని చూస్తుండి పోయింది. ఒళ్ళు నీరు గారిపోయింది.

"భయపడ్డారా?" అతడడుగుతున్నాడు.

ఏమి మాట్లాడలేక పోయింది. తల వొంచుకొని అతడితో నడిచింది.

పాములగురించి, అతడికి జరిగిన అనుభవాల గురించి అతడేమిటేమిటో చెబుతున్నాడు. ఒక్కటీ చెవిన పడటం లేదు. అతడి గురించిన ఆలోచనలతో ఎంత భయపడిపోయిందో అనుకొంది అరచేతితో గుండె దాచుకొంటూ

పాము పేరు వింటేనే భయం తనకి.

ఒకసారి బావతో పొలం వైపుకు బయలుదేరింది.

పచ్చని చేలల్లో షికార్లు చేసేరు. పొలం గట్టు మీద నడుస్తూ సంధ్యకాంతుల్ని పరవశంతో పరికిస్తోన్న సమయంలో బావ అరిచేరు. "హేమా! అదిగో పాము !" అంటూ.

"అమ్మో !" అంటూ ఒక్క దూకున ప్రక్కన నిలబడిన మన్మోహన్ మీద పడిపోయింది. అతడిని హత్తుకొనిపోయింది భయంతో వణికిపోతూ.

కళ్ళు తెరవాలంటే భయం. అతడూ గట్టిగా ఒత్తుకొంటూ, "భయం లేదులే, అదే పోతుంది," అంటూ వెన్నురాస్తున్నా వణుకుతగ్గలేదు.

కళ్ళు తెరిచేక "ఎటుపోయింది ?" అంటే ఒకటే నవ్వు కొంటెగా.

"భలేపాము. ఎంత మంచిదో పాపం. ఈసారి రానీ మళ్ళీ...." అంటూ నవ్వుతోంటే అతడి వేషం అర్థం అయింది.

"ఛీ పో. ఎంత చదివినా పల్లెటూరి సరసాలు పోలేదు నీకు." అంటూ కోపగించుకొంది.

ఎప్పుడైనా గుర్తొస్తే ఎంత నవ్వొచ్చేదో ?

చల్లటి గాలి రివ్వున వీచింది. హేమంతలో మన్మోహన్ స్మృతులు కదిలేయి.

"ఇటువంటి సమయంలో తనకు తోడుగా అతడుంటే ?"

ఇక భయం ఏముంది ? తననెత్తుకొని అయినా. అంత చిలిపి అతడు ! నవ్వొచ్చింది హేమకు ఆ ఆలోచనకే.

తను ఎం. ఎకు అప్లై చేసేక అతడొచ్చి వీల్లేదంటూ కూర్చున్నాడు.

అమ్మయితే, "నీకంత చదవాలని వుంటే పెళ్ళయ్యేక చదువు. బావకే ఉద్యోగం వచ్చింది. హోటలు మెతుకులు తినలేకపోతున్నానంటూ గొడవ అతడు. ఎందుకొచ్చిన చదువు ఇంకా" అంటూ కేకలేసింది.

పెళ్ళయ్యేక తను చదవగలదా ? చదివినా వంట బడుతుందా బావ అల్లరికీ, చిలిపి సరసాలకీ.

అతడు కోపం తెచ్చుకొని మూతి బిగించుకొని కూర్చుంటే తనకెంత నవ్వొచ్చింది. "రెండేళ్లంటే ఎంత ? మిసెస్ హేమంత మన్మోహన్, ఎం. ఎ. అనిపించుకొంటే నీకు మాత్రం గర్వం కాదూ ? నాకు పోస్టుగ్రాడ్యుయేషన్ చేయాలని వుంది బావా! ప్లీజ్, ఈ ఒక్క కోరిక తీరనీ, తర్వాత నీ కోర్కెలన్నీ తీరుస్తాగా ?" అంటూ బుజ్జగించవలసి వచ్చింది.

అతడి చిలిపిచేష్టలు, అల్లరి సరసాలు ఒక్కటిగా తలపుకొస్తున్నాయి హేమంతకు.

సెలవుల రోజులన్నీ అతడితోనే గడిచిపోయేవి.

ఇప్పుడు తనొస్తున్నట్లు తెలుసో, తెలియదో ?

అమ్మకిలా వున్నదని కబురైనా వెళ్ళిందో లేదో?

ఆకాశం నుండి రాలిపడిన చినుకులు ఒకటి రెండు ఆమె చేతి మీద పడటంతో ఉలిక్కిపడింది.

"ఆరె, వర్షం వస్తోంది" అంటుండగానే చిటపట చినుకులతో పెద్దదయిపోయింది వాన.

మర్రిచెట్టు క్రిందికి చేరేరు ఇద్దరూ. ఆకాశం భోరున ఏడుస్తోంటే చెట్లు, చేమలూ చలించిపోతున్నాయి.

"ఏమైమెంతవుతుందో ?" భయాన్ని కప్పిపుచ్చుకొంటూ అంది.

"పావుతక్కువ నాలుగు."

ఏకధారగా కురిసిన వానలో అలాగే తడుస్తూ, వణుకుతూ నిలబడిపోయేరు. హేమంత కన్నీరూ వాననీటితో కలిసిపోయింది.

అందరితో కలసి వెళ్ళగలిగితే తనింత బాధకూ, భయానికీ లోనుగాకపోను.

ఈ నిశీధిలో, నిశబ్దంలో, తనూ, అతడే మిగిలిపోవడం ఎంతవరకు క్షేమం ?

కొన్ని యుగాలు గడిచినట్లనిపించింది వాన తగ్గుముఖం పట్టేసరికి !

ఒంటి నంటిపెట్టుకొన్న చీర తడిసి కాళ్ళకు బంధాలుపడుతోంది. కొంగు నిండుగా కప్పుకొన్నా తడిసిన బట్టల్లో తన ఒళ్ళు తనకే సిగ్గుగా వుంది. కుచ్చెళ్ళు ఎత్తి పట్టుకొనే నడుస్తోంది.

"చలేస్తుంది కదూ" అతడడిగేడు.

"ఉహూఁహూ ! లేదు." తడబడుతూ అంది.

"దగ్గర్లో వద్దాంలే. పదండి."

"మీ మేలు మరచిపోలేను. తోడబుట్టిన అన్నదమ్ములు లేని నాకు అంతకు మించిన ఆదరణ చూపించేరు. సెలవిస్తే నేనిక వెళ్ళిపోగలను" అంది.

చీకట్లు పూర్తిగా విడలేదు.

అతడు ఆలోచనగా అన్నాడు. "ఇంతదూరం తీసుకొచ్చేక మిమ్మల్ని ఇప్పుడు ఒంటరిగా పంపడం నాకెందుకో సమ్మతంగాలేదు. నేనూ వస్తాను పదండి." అంటూ గుర్రం బండీ మాట్లాడేడు.

పూర్వపు భయమూ, ఆందోళన తనలో ఇప్పుడు లేవు.

అతడితో ఫ్రీగా మాట్లాడుతోందిప్పుడు.

తల్లి గురించి చిన్నారి చెల్లెలి గురించి చెబుతోంది. పుట్టి పెరిగిన పల్లె వైభవాన్ని దాటి చెబుతోంది.

అమ్మకు నయమయి చల్లగా వుంటే చాలు తనకిక కోరికలే లేవన్నది.

అతడు మౌనంగా వింటున్నాడు. తదేకంగా ఆమెనే చూస్తున్నాడు.

హేమంతకు ఇప్పుడెంతో విచిత్రంగా వుంది.

కొన్ని గంటల క్రితం వరకూ అతడెవరో, తనెవరో ట్రెయిన్‌లో తన ముందు కూర్చున్నప్పుడు కూడా అతడి వాలకానికి చిరాకు పడింది. ఇబ్బంది అనుభవించింది. అతడెంతో ఉదారంగా తనను వెంటబెట్టుకొని వస్తోన్నప్పుడు కూడా అనుమాన పడింది.

ఇప్పుడు ? మబ్బులు చెదిరి ఆకాశంలా మానసం నిర్మలత్వం దాల్చి, అతడిపట్ల ఆలోచనలు ఎంతో ఉదాత్తమైనవిగా వున్నాయి.

అనంతమైన జీవన పయనంలో దారి తప్పిన బాటసారులై గడిపిన కొద్ది సమయమూ ఎంతో అమూల్యమైనదిగా అనిపిస్తోంది. తర్వాత మళ్ళీ ఎవరికెవరో ? కాని మహోన్నతమైన అతడి వ్యక్తిత్వాన్ని ఎలా మరచిపోగలదు ! పట్టపగలైనా బయట తిరిగేందుకు భయపడే ఈ మానవారణ్యంలో, చిక్కని చీకటిలో తనకు దారి చూపించిన భగవాన్‌దాస్‌ని తనెలా మరిచిపోగలదు ?

పల్లె దగ్గర పడింది.

"ఏలూరులో మీ బంధువులున్నారా ?"

"ఎవరూ లేరు"

"మరి ?"

"ఇవాళ ఇంటర్వ్యూ వుంది. కానీ అదీ తేలిపోయింది."

"అప్పుడే ? అదెలా ?"

"ట్రెయిన్ యాక్సిడెంట్‌తోనే దానికి తిలోదకాలు ఇచ్చేసాను. వచ్చే ఉద్యోగం అయితే, తిన్నగా వెళ్ళిపోయి ఈపాటికి ఏలూరులోనే ఉండేవాడిని. అయినా ఇప్పుడు నాకెంతో తృప్తిగా వుంది హేమంతా ! అదిగో మీ వూరే అనుకొంటాను అది." అన్నాడు.

"అవును" పల్లె దిక్కుకు తిరిగిన హేమంత, ఎదురొస్తున్న మనిషిని చూస్తూనే ఒక్కసారిగా ఉప్పొంగిన సంతోషంతో బండి ఆపించి చెంగున దూకి అతడి కెదురుగా పరుగు తీసింది.

"బావా !"

అతడి కళ్ళల్లో ఆశ్చర్యం.

"అమ్మకెలా వుంది బావా ! ఆతృతతో అడిగింది.

"ఏం ఫరవాలేదు. బాగానే వుంది. నువ్వెలా వచ్చేవు ? తెనాలి దగ్గర ట్రెయిన్ యాక్సిడెంట్ జరిగిందని విని కంగారుతో బయలుదేరేను."

చేయిచాచి బండిలోకి చూపించింది హేమంత. "అదిగో, అతడే దేవుడిలా వచ్చి నన్ను మన వూరు చేర్చేడు. తెనాలివరకూ ఆ మూడుమైళ్ళు

చీకటిలో, వానలో, చలిలో మేమిద్దరమే నడిచి వచ్చేం. లేకపోతే అమ్మను తలచుకొంటూ ఏడుస్తూ ఆ రైల్లోనే పడివుండేదానిని.''

భగవాన్‌దాస్ బండి దిగి వచ్చేడు.

పరిచయం చేసింది ఒకరినొకరికి.

మన్మోహన్ అతడినే చూస్తున్నాడు నిశ్శబ్దంగా, నిశితంగా.

"నేనిక వెళతాను. శెలవు ఇప్పించండి.''

"ఇంతవరకూ వచ్చి మా వూరు రాకుండా వుంటారా? మా అమ్మను చూడకుండా వెళ్ళిపోతారా?'' నిందారోపణగా అంది హేమంత.

"క్షమించండి. వేరే పనులున్నాయి.'' అంటూ శెలవు తీసుకొని తిరిగి వెళ్ళిపోతున్న అతడిని రెప్పవాల్చకుండా చూస్తుండిపోయింది.

మానవత్వం మూర్తీభవించిన అతడికి మనసులోనే జోహార్లు అర్పించుకొంది.

"ఇంకా వొదల్లేకపోతున్నావన్న మాట!''

ఉలిక్కిపడి వింతగా చూసింది. అర్థం కాలేదు అతని మాట.

"అతడింత మహాత్ముడని అనుకోలేదు బావా! రాత్రి నేను అనుభవించిన బాధ, భయం, వేదన అన్నీ దూదిపింజల్లా ఎలా ఎగిరిపోయేయో! కేవలం వేటగాళ్ళే పొంచి వున్న ఈ లోకంలో మహాత్ములూ వున్నారని ఇప్పుడే తెలుసుకొన్నాను.''

మన్మోహన్ మాట్లాడలేదు.

తెప్పరిల్లుకొని హేమంత మళ్ళీ అడిగింది. "అమ్మకేమిటి సుస్తీ బావా! టెలిగ్రాం చూసుకొని ఎంత హడిలిపోయేనో తెలుసా?''

"ఆవిడకేం లక్షణంగా వుంది. ముహూర్తాలు పెట్టిస్తున్నారంటే నువ్వు ఒప్పుకోవని అత్తయ్యకు సీరియస్ అని టెలిగ్రాం ఇవ్వగానే పరిగెత్తుకొని వస్తావని అందరితో ఆలోచించే ఈ టెలిగ్రాం ఇప్పించేను.''

"ఏవిటి?'' కోపంగా చూసింది హేమంత. టెలిగ్రాం చూసుకొని తను అనుభవించిన భయం, ఆ వేదన గుర్తుకొచ్చేయి. ప్రయాణంలో తను పడిన ఆ వేదన తలపుకొచ్చింది. ఆ తర్వాత జరిగిన కష్టాలు, మానసిక కల్లోలం స్ఫురణకు రావడంతో కోపం ముంచుకొచ్చింది.

"ఎంత పనిచేసేరు బావా! కేవలం పెళ్ళికోసం ఇంత దారుణమైన అబద్ధాన్ని సృష్టించేరన్న మాట!'' భరించలేనట్లు అంది.

మన్మోహన్ నిశితంగా చూస్తూ అన్నాడు. "పెళ్ళి ఎప్పటికప్పుడు చదువు వంకన వాయిదా వేస్తుంటే నేనేమిటో అనుకొన్నాను ఇన్నాళ్ళు. ఇప్పుడర్థం అయిందిలే.''

"ఏమిటది?'' విస్తుపోతూ అంది.

"ఛీ! అదీ నానోటితోనే చెప్పించాలనా? ఒక ఆడది ఎంత తెగువ, బరితెగింపు లేకపోతే ఒంటరిగా ఒక పరాయి మగవాడితో ప్రయాణం చేస్తుంది. పైగా ఎంతో సంతోషపడిపోతూ చీకటిలో, వానలో, చలిగాలిలో తిరిగొచ్చేం అని సిగ్గులేకుండా చెబుతావా? ఛీ! ఆడదానిని నమ్మడం అంత బుద్ధి తక్కువ పని మరేదీ లేదు!'' అంటూ నిరసనగా చూస్తూ వెనక్కి తిరిగి చూడకుండా చరచరా సాగిపోయేడు మన్మోహన్.

వెర్రిదానిలా చూస్తుండిపోయింది హేమంత!

రామరాజ్యంలో రాముడు కళ్ళముందు మెదిలేడు,

సీతను గురిచేసిన అవమానం తలపుకొచ్చింది. ★


భారతదేశపు అతిచిన్న ప్రెషర్ కుక్కర్

365 రోజులవరకు విడిభాగాలను ఉచితంగా యిచ్చే ఏ నిబంధనలేని గ్యారంటీతో

బులెట్ ప్రెషర్ కుక్కర్

- 14 సైజులలో రెండు వేరువేరు మోడల్‌లో భారత దేశపు ఏకైక కుక్కర్
- భారతదేశపు అతిచిన్న 2 లీటర్ల ప్రెషర్ కుక్కర్
- రూ. 1/- మాత్రమే ధరగల లేటెస్ట్ సేఫ్టీ వాల్వ్ పరికరముగల భారతదేశపు ఏకైక కుక్కర్
- 365 రోజులవరకు విడిభాగాలను ఉచితంగా యిచ్చే ఏ నిబంధనలేని గ్యారంటీగల భారతదేశపు ఏకైక కుక్కర్




5 సం॥ల గ్యారంటీ

ఎలైట్ ఏజన్సీస్ 7, 8, 9, జగదీశ్ మార్కెట్, ఆబిడ్స్, హైద్రాబాద్-1 ఫోన్ : 223148